# దీపావళి రామాయణం !

"శృంగ" పార్టీకి చెందిన సూర్యారావు చుట్ట కాలుస్తూ "భంగ" పార్టీకి చెందిన బాలయ్యని, "ఇదుగో, బాలయ్యా! నిన్న శాస్త్రుల్లుగారు రామాయణం, పురాణం చెపుతూ సీతారాముల కళ్యాణం దగ్గర ఆపేశాడు గదా! అక్కడ నాకెప్పుడూ ఒక అనుమాన మోయ్! సీతారాముల పెళ్ళి అయిన తరువాత వచ్చిన మొదటి దీపావళి రాముడు మిథిల వెళ్ళాడా? సీత అయోధ్య వచ్చిందా? టపాసులు ఎక్కడ కాల్చుకున్నారు?" అని అడిగాడు.

బాటిల్ ఓపెన్ చేస్తున్న బాలయ్య, "దానికి పెద్ద అనుమానం ఎందుకోయ్! రాముడే మిథిల వెళ్ళి ఉంటాడు" అని తేల్చేశాడు.

"అని ఎలా చెప్పగలవు? శ్రీరామనవమి తరువాత వచ్చే పెద్ద పండుగ వినాయక చవితి కదా? అదే మొదటి పండగ. ఆ పండక్కి రాముడు అత్తవారింటికి వెళ్ళి ఉంటాడు. తరువాత దీపావళికి సీతే అయోధ్య వచ్చి ఉంటుంది." తనకున్న పండగల నాలెడ్జి అంతా బయట పెట్టాడు పాండురంగారావు.

అలా వీల్లేదు. మొదటి పండగ వినాయక చవితికి రాముడు మిథిల వెళితే, రెండో పండగ దసరాకి సీత అయోధ్య వచ్చి వుంటుంది. మూడో పండగ దీపావళికి రాముడే మిథిల వెళ్ళి ఉంటాడు." తన లా బ్రెయిన్ అంతా ఉపయోగించాడు రామనాథరావు.

భంగ పార్టీ వాళ్ళంతా "భలే, భలే" అని చప్పట్లు చరిచాడు.

"అశోక్‌కుమార్ అరుస్తూ లేచాడు." ఈ మొదటి పండగలు గిదటి పండగలు మీ సౌత్‌లోనే! మా నార్త్‌లో దీపావళే ముఖ్యం. ఆ రోజునే ఖాతా పుస్తకాలు కూడా మారుస్తాం. అంత ముఖ్యమైన పండక్కి, ఆ యింటి కోడలు సీతే అయోధ్య వచ్చి వుంటుంది."

శృంగ పార్టీ వాళ్ళు "కరెక్ట్-కరెక్ట్" అంటూ బల్లలు బాదేశారు.

ఇదేమన్నా వడ్డీ వ్యాపారమనుకున్నావటోయ్ బద్దూ!" అంటూ ఎద్దేనా చేశాడు సూర్యారావు. "కాదులే! చుట్టల కంపెనీ అనుకుంటున్నాడు!" అని తిప్పి కొట్టాడు బాలయ్య.



ఆవేశాలు పెరిగాయి. కావేశాలు ఖస్సుమన్నాయి. మిత్ర పక్షాలైన శృంగ భంగ పార్టీల్లో చీలికలు ఏర్పడ్డాయి. సౌత్, నార్త్ భావాలు చెలరేగాయి. తలలు పగిలే సూచనలు కనిపించాయి.

ఇండిపెండిట్ ఈశ్వరరావు లేచాడు. అందరికీ సర్దిచెప్పాడు. "రేపు పురాణం శాస్త్రులు గారినే అడుగుదాం. ఆయన చెప్పినదానికి అందరం ఒప్పుకుందాం.

రెండు రోజులుగా పాతిక మంది కూడా రాని పురాణానికి ఆ రోజు పాతిక వందల మంది తయారయ్యారు. కలెక్టర్, మేయర్ ముందరి వరసల్లో కూర్చున్నారు. పోలీసు బందోబస్తు చాలా పగడ్బందీగా వుంది. తన ఉపన్యాసం రెండు రోజుల్లో ఇంతమందిని ఆకట్టుకుందా అని ఆశ్చర్యపోయాడు శాస్త్రులుగారు. రెండు పార్టీల నుంచి శాస్త్రుల్లు గారి చెవుల్లోకి ప్రలోభాలు ఊదబడ్డాయి. శాస్త్రులు గారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. "అవుటు" కని చెప్పి అంటే పోదామా అనిపించింది. చివరికి ఎలాగో అలాగ విజయవాడ రేడియో ఫ్రీక్వెన్సీకి తన గొంతు సవరించుకుంటూ, "నాయనా! రామాయణ, భారత, భాగవతాలు చదవని మన కుర్రకారులకి యిలాంటి సందేహాలే వస్తాయి. దీపావళి కృష్ణావతారం నాటి కథ. రామాయణం నాటికి కృష్ణుడు పుట్టలేదు. అప్పుడు దీపావళి ప్రసక్తేలేదు. శతవిధాల ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడు సీతారాములు ఎవరియింటి అద్దంలో ఎవరి మొహాలు వాళ్ళు చూసుకుంటూ కూర్చుని ఉంటారు." అని తేల్చాడు.

సభలో అందరూ ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకున్నారు. ఏనుగు మార్కు ఎలక్ట్రిక్ బాంబు తుస్సుమంది.